క్లుప్తంగా

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి


పొగాకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: పొగాకు సాగులో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని ఐసీఏఆర్, ఎన్ఐఆర్సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ అన్నారు. ఐకార్ జాతీయ వాణిజ్య పంటల పరిశోధనా కేంద్రం జీలుగుమిల్లి ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్ బయోకెమ్ సంస్థ ఎండీ మోహన్‌రావు, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ వైవి. సుబ్బయ్య, ఎల్‌కె ప్రసాద్, కె. సరళ, కె.రాజశేఖరరావు, ఐటీసీ ప్రతినిధులు కోటేష్, పీసీఎస్ ప్రతినిధి రఘు, పొగాకు బోర్డు అధికారులు, ట్రేడ్ ప్రతినిధులు ఎన్ఐఆర్సీఏ శాస్త్రవేత్తలు సిబ్బంది, రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బోదెలోకి దూసుకెళ్లిన కారు

ద్వారకాతిరుమల: మండలంలోని సూర్యచంద్రరావుపేట చెరువు వద్ద ఒక భక్తుడి కారు మంగళవారం మధ్యాహ్నం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బోదెలోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం మేరకు తూర్పుగోదావరి జిల్లా, దూబచర్లకు చెందిన ఒక భక్తుడు ద్వారకాతిరుమలకు శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా కారులో వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి కారు ఒక్కసారిగా అదుపు తప్పి రహదారి పక్కనున్న బోదెలోకి దూసుకెళ్లింది. కారు ముందు భాగం దెబ్బతినగా, డ్రైవ్ చేస్తున్న భక్తుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇదిలా ఉంటే బోదెలో ఉన్న కారును స్థానికులు ట్రాక్టర్ సహాయంతో బయటకు తీశారు.

గోదావరిలో పడవకు అనుమతి ఇవ్వాలి

కుక్కునూరు: మండలంలోని దాచారం రేవు నుంచి కూనవరం మండలంలో కుమార స్వామి గుట్టకు వెళ్లేందుకు పడవ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సదర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ పడవకు ఎందుకు పర్మిషన్ ఇప్పించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బ తినకుండా పడవను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తూము వెంకటేశ్వరావు, కుంజా వెంకటనర్సయ్య, వాడపల్లి లక్ష్మణాచార్యులు, బొల్లు రాము, బాలకృష్ణ, చెరువుకట్ల సతీష్, వేముల శేషగిరియాదవ్, తాడబోయిన నరేష్, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- శివాలయాలు ముస్తాబు
- పట్టిసం క్షేత్రానికి పోటెత్తనున్న భక్తులు


పోలవరం రూరల్: శివక్షేత్రం దిగువన ఏర్పాటు చేసిన క్యూలైన్లు


శివక్షేత్రానికి వెళుతున్న భక్తులు

పోలవరం రూరల్: ఈ నెల 26 మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా పట్టిసం శివక్షేత్రం విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. ఉత్సవాలకు లక్షమందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ ఆదేశాలతో పలు శాఖల అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే ఉత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి ఏర్పాట్లను పరిశీలించి అధికార యంత్రాంగానికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తొలిపూజ

మంగళవారం అర్ధరాత్రి వంశపారంపర్య ధర్మకర్త కుచ్చర్లకోట వంశీకులు శ్రీ భద్రకాళీసమేత వీరేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం 3.30 గంటల నుంచి భక్తులకు దర్శనం ప్రారంభిస్తారు. దర్శనానికి వచ్చే భక్తులకు మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. అర్ధ రాత్రి సమయానికి భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తెల్లవారు జామున పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించి దైవదర్శనం చేసుకుంటారు. కాలినడకన వెళ్లి వచ్చే విధంగా మార్గమధ్యలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేపట్టారు.

చింతలపూడి: మహా శివరాత్రికి శివాలయాలు ముస్తాబవుతున్నాయి. చింతలపూడిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వేగిలింగేశ్వరస్వామి ఆలయం శివరాత్రి శోభను సంతరించుకుంది. వేంగి రాజుల కాలంలో 500 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం కావడంతో చింతలపూడి శివాలయం ప్రసిద్ధి గాంచింది. దీంతో పాటు మండలంలోని రేచర్ల, రాఘవాపురం గ్రామాల్లో ఉన్న శివాలయాలు సైతం శివరాత్రి పర్వదినం సందర్భంగా ముస్తాబు చేస్తున్నారు.

అర్ధ రాత్రి ప్రారంభమైన ఉత్సవాలు

బుట్టాయగూడెం: మహా శివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మంగళవారం అర్ధ రాత్రి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న పట్టిసీమ శివక్షేత్రంతో పాటు బుట్టాయగూడెంలోని త్రిపుర సుందరీ సమేత కామేశ్వరస్వామి వారి ఆలయంలో అదే విధంగా కుమ్మరిగట్టు వద్ద ఉన్న ఉమా సమేత ఉమామహేశ్వర స్వామివారి ఆలయంలో అదే విధంగా రెడ్డిగణపవరంలోని విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుట్టాయగూడెంలోని త్రిపుర సుందరీ సమేత కామేశ్వర స్వామి వారి ఆలయంలో, కుమ్మరిగట్టు వద్ద ఉన్న ఉమా సమేత ఉమామహేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం రాత్రి లోక కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

వైభవంగా ముక్కంటి కల్యాణోత్సవం

కొయ్యలగూడెం: శివరాత్రి మహోత్సవ సందర్భంగా మంగళవారం కన్నాపురంలోని దుర్గాభవాని అన్నపూర్ణ సమేత రసలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ అల్లూరి రాంబాబు నేతృత్వంలో ప్రధాన అర్చకులు మణికంఠ శర్మ కళ్యాణ క్రతువు నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైన విశేష పూజలు అర్చనాది అభిషేక కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం స్వామివారి లింగోద్భవం అర్ధ రాత్రి పన్నెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా పట్టిసం పుణ్యక్షేత్రానికి మంగళవారం మధ్యాహ్నం నుండి భక్తులు తరలి వెళ్లారు. ప్రతి అరగంటకు జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం బస్సు డిపోల నుండి పట్టిసీమకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.


కన్నాపురంలో కల్యాణ శోభతో దుర్గాభవాని అన్నపూర్ణ సమేత రసలింగేశ్వరస్వామి


చింతలపూడి: విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయం


బుట్టాయగూడెం: ఉత్సవాలకు ముస్తాబైన కామేశ్వరస్వామి ఆలయం


పోలవరం రూరల్: పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ

సూపర్‌సిక్స్ అమలులో 'కూటమి' విఫలం

కామవరపుకోట: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షుడు టీవీఎస్ రాజు మంగళవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు బ్యాంకు ఖాతాలో ప్రతి నెలా నగదు జమ, రైతులకు పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఆ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. నేడు ఆర్థిక పరిస్థితి బాగో లేదన్న చంద్రబాబుకి ఎన్నికల ముందు ఆర్థిక పరిస్థితి గురించి తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు.

మద్యం షాపుల మూసివేత

జంగారెడ్డిగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని మద్యం షాపులను ఎక్సైజ్ అధికారులు మంగళవారం మూసి వేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 25వ తేదీ సాయంత్రం నాలుగు నుంచి 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో డ్రైడే అమలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సర్కిల్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మద్యం షాపులు మూసి వేశామన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో మద్యం షాపులు, రెండు బార్‌లను మూసివేశామని తెలిపారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం


ప్రచారం చేస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

కొయ్యలగూడెం: పొంగుటూరు, కన్నాయగూడెం, రాజవరం, యర్రంపేట గ్రామాలలో పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు పీడీఎఫ్ అభ్యర్థి గెలుపు ఎంత ముఖ్యమో పట్టభద్రుల ఓటర్లకు వివరించారు. దిడ్ల వీర రాఘవులు గతంలో పీడీఎఫ్ తరపున చేసిన పోరాటాలు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ ప్రజలు తరపున, ఉద్యోగ, కార్మిక వర్గాల తరపున చేసిన ఉద్యమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.నాగమణి మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, డీఎస్సీ లేదని కూటమి అభ్యర్థికి ఎందుకు ఓటేయాలన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి జ్ఞానజ్యోతి

లింగపాలెం: జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ అంగన్‌వాడీల బలోపేతానికి దోహదపడుతుందని చింతలపూడి ఐసీడీఎస్ సీడీపీవో మాధవి అన్నారు. మండల పరిధిలోని సింగగూడెం హైస్కూల్ నందు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ ముగింపు సందర్భంగా సీడీపీఓ మాధవి హాజరై జ్ఞాన జ్యోతులకు పలు విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ సున్నా నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు మానసిక శారీరక ఎదుగుదలతో పాటు నూతన అంశాలను గుర్తించే విధంగా అంగన్‌వాడీలు విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్ర శ్రీధర్, రిసోర్స్ పర్సన్‌లు ఎస్.తిరుపతి, కేవీవీ సత్యనారాయణ, బి.కిషోర్, సీఆర్‌ఎంటీలు టి.కనకరాజు, టి.సునీత అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

శిక్షణ పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు ఎస్‌కే అబ్దుల్ అజీజ్ మంగళవారం పరిశీలించారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన అసైన్‌మెంట్ టూల్, హబ్ అంగన్‌వాడీ, మోడల్ ఫౌండేషన్ స్కూల్, పోస్ట్ క్విజ్ కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు ఎస్‌వీ మూర్తి, ఎస్‌కే నజీర్, ఎం. స్వామి అయ్యప్ప, కోర్సు కోఆర్డినేటర్ కె.లక్ష్మీకాంతం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.


లింగపాలెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ


పోలవరం: అంగన్‌వాడీల శిక్షణను పరిశీలిస్తున్న అబ్దుల్ అజీజ్

ముమ్మరంగా 'పది' పరీక్షల ఏర్పాట్లు


విద్యార్థుల రికార్డులను పరిశీలిస్తున్న డీవైఈవో


విద్యాశాఖ అధికారులతో చర్చిస్తున్న ఎంపీడీవో

కొయ్యలగూడెం: పదో తరగతి పరీక్షలు మరో పక్షం రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కొయ్యలగూడెం డివిజన్ పరిధిలో పది మండలాలు ఉండగా 2,788 మంది మంది విద్యార్థులు హాజరవుతున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవైఈవో రామన్న దొర పేర్కొన్నారు. మొత్తం డివిజన్ పరిధిలో 34 సెంటర్లను పరీక్షల నిర్వహణకు శరవేగంగా సిద్ధం చేస్తున్నామన్నారు. కొయ్యలగూడెం విద్యా డివిజన్ పరిధిలో కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, పోలవరం, కుకునూరు, వేలేరుపాడు, టి నరసాపురం, జీలుగుమిల్లి, కామవరపుకోట, ద్వారకాతిరుమల మండలాలు ఉన్నాయి. ప్రభుత్వ, ఐటీడీఏ, ప్రైవేట్, ఇతర కేజీబీవీ విద్యాసంస్థలు కలిపి 134 ఉన్నాయన్నారు. ఇప్పటికే పదవ తెరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వారికి పరీక్షలు విజయవంతంగా రాసే విధంగా తర్ఫీదు ఇస్తున్నామని అన్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాలు మెరుగైన విధంగా రాబట్టేందుకు వంద రోజుల ప్రణాళికలు అమలు చేస్తున్నామని అన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల చొప్పున ప్రత్యేక తరగతులు కేటాయించి తర్ఫీదు ఇవ్వడంతో పాటు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

అధికారులకు సూచనలు ఇచ్చాం



ఇప్పటికే పరీక్షా కేంద్రాలలో ఏర్పాటులను పరిశీలించి అధికారులకు సూచనలు సలహాలు అందజేశాం. ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యేవిధంగా వసతి సౌకర్యాలు కల్పించబడ్డాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరచూ పదవ తరగతి పరీక్షా కేంద్రాలను, ప్రత్యేకవిద్యా తర్ఫీదు కేంద్రాలను పరిశీలించి విద్యార్థులతో మమేకం అవుతున్నాం.

–ఎంపీడీవోకే కిరణ్ కుమార్

ఒత్తిడిని అధిగమించాలి




ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒత్తిడిని అధిగమించడం విద్యార్థులకు శ్రమతో కూడుకున్న పని. ఈ నేపథ్యంలో ప్రత్యేక తరగతులలో మానసిక వ్యక్తిత్వ నిపుణులచే తరచూ శిక్షణ ఇప్పించడం ప్రభుత్వ బాధ్యత. స్వచ్ఛంద కేంద్రాల ఆధ్వర్యంలో మానసిక వ్యక్తిత్వ నిపుణులచే కొన్ని చోట్ల నిర్వహిస్తున్న సెంటర్ల లోని విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదేదో ప్రభుత్వమే కల్పించుకుని అన్ని చోట్ల అమలు చేయాలి.

–జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి

తాడువాయిలో ఏర్పాట్లు పూర్తి

జంగారెడ్డిగూడెం: మండలంలోని తాడువాయి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి ఆలయ మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. దక్షిణకాశీగా పేరొందిన స్వయంభూ శ్రీభద్రకాళీ సమేతర వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేశారు. 26వ తేదీ మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారికి ప్రాతఃకాలం నుంచి రుద్రాభిషేకం, విశేషపూజలు, స్వామి వారి దివ్య మంగళ దర్శనాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, దేవాలయ బలిహరణ పూజలు నిర్వహిస్తారు. రాత్రి దీపాలంకరణ సేవా, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.


ఉత్సవాలకు ముస్తాబవుతున్న వీరేశ్వరస్వామి ఆలయం


మరకతలింగేశ్వరస్వామి

మద్ది క్షేత్రంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆలయంలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మంగళవారం సందర్భంగా స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులు (నాగవల్లీ దళాలు)తో అష్టోత్తరం పూజలను నిర్వహించారు. పలు సేవలు రూపేణా ఆలయానికి మంగళవారం మధ్యాహ్నం వరకు రూ.1,20,100 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.



ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

జగదాంబ అమ్మవారి జాతరకు విరాళం

బుట్టాయగూడెం: మార్చి 6వ తేదీన ప్రారంభం కానున్న జీలుగుమిల్లి జగదాంబ అమ్మవారి జాతర మహోత్సవాలకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర మహోత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో కోలాట నృత్యాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో మంగళవారం పలువురు మహిళలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. మండలంలోని దొరసానిపాడుకు చెందిన వరసిద్ధి వినాయక కోలాట భజన మండలి సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించారు.అనంతరం ఆలయ మండపంలో కోలాట నృత్యాలు చేశారు.


కోలాట నృత్యాలు చేస్తున్న మహిళలు